సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 16 । జూలై । 2025



అధిక ఎరువులతో అనర్థాలే

పంటల సాగులో రైతులు అధికంగా రసాయన ఎరువులు వినియోగిస్తూ భూమికి ముప్పు తెచ్చిపెడుతున్నారు. వివరాలు 10లో ▸



డీఎస్ఆర్‌తో రైతులకు మేలు

సంప్రదాయ విధానంలో వరిసాగు చేస్తున్న రైతులకు డీఎస్ఆర్‌పై వ్యవసాయ నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు. వివరాలు 10లో ▸



చేప చేతికి చిక్కింది

రెండు గ్రామాల మధ్య 30 ఏళ్ల నుంచి కొనసాగుతున్న చేపల చెరువు వివాదం నమసిపోయింది. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

న్యాయ సేవలు మరింత విస్తృతం: కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: జిల్లాలో బాధిత మహిళలకు న్యాయ సహాయ సేవలు మరింత విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం మహిళా సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మిషన్ వాత్సల్య ద్వారా బాలల సంక్షేమం, దత్తత ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహారం, విద్య, ఆరోగ్య పరిరక్షణపై నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు అందుతున్న సేవలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, సీడీపీఓలు చంద్రకళ, జయరామ్, ప్రియాంక, అంజమ్మ, సుజాత, డీసీపీఓ రత్నం, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సౌమ్య, జిల్లా మహిళ సాధికారత కోఆర్డినేటర్ పల్లవి, సఖి కేంద్రం కోఆర్డినేటర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలు, కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మెదక్ ఆర్‌సీఓ గౌతంకుమార్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. తాత్కాలిక పద్ధతిలో ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, సోషల్, గణితం, హిందీ సబ్జెక్టులను బోధించేందుకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ, పీజీ చేసి 50% మార్కులు తగ్గకుండా ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఈ నెల 19న సంగారెడ్డిలోని ఆర్‌సీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441250450ను సంప్రదించాలన్నారు.

17 కల్లు దుకాణాల నమూనాల సేకరణ



కల్లు దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఐలాపూర్‌లో అనుమతి లేకుండా విక్రయిస్తున్న ఓ కల్లు దుకాణంపై కేసు పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. నియోజకవర్గ పరిధిలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదలలో మొత్తం 17 కల్లు దుకాణాల నుంచి నమూనాలు సేకరించి నిజామాబాద్ ల్యాబ్‌కు పంపించారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర గౌడ్ మంగళవారం మీడియాకు వెల్లడించారు.

సిగాచి బాధితులకు రూ.కోటి పరిహారం

సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: సిగాచి పరిశ్రమలో మరణించిన వారి కుటుంబాలకు పరిహారం కింద రూ.కోటి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఐటీయూ నేతలు అదనపు కలెక్టర్ నగేశ్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గౌరి మాట్లాడుతూ... సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం ప్రాంతంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రూ.50 లక్షలు, పరిశ్రమ యాజమాన్యం కోటి రూపాయలు వెంటనే ఇవ్వాలన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం కల్పించడంతోపాటు పరిశ్రమల ఇన్‌స్పెక్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. ఘటన జరిగి 15 రోజులవుతున్నా ఇప్పటికీ పరిశ్రమ యాజమాన్యంగాని, ప్రభుత్వంగాని బాధితులను ఆదుకోవడం లేదని మండిపడ్డారు. జిల్లాలో కూడా చాలా పరిశ్రమల్లో రియాక్టర్స్ లేవని, అలాంటి పరిశ్రమలపై చర్యలు చేపట్టాలన్నారు.

వసతుల కల్పనకు రూ.3.34 కోట్లు

ప్రభుత్వ కళాశాలలు బలోపేతం

- పెరగనున్న ప్రవేశాలు!



న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందించేందుకు సర్కారు దృష్టి సారించింది. ప్రభుత్వ కళాశాలల్లో వసతుల లేమితో విద్యార్థులు ప్రైవేట్ కాలేజీల వైపు మొగ్గు చూపుతున్నారని గుర్తించిన ప్రభుత్వం అందుకనుగుణంగా చర్యలు చేపట్టింది. కళాశాలల్లో పూర్తిస్థాయిలో అధ్యాపకులు నియామకం, సీసీ కెమెరాల ఏర్పాటు, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, విద్యార్థుల హాజరు పర్యవేక్షణ నిమిత్తం రూ.3.34 కోట్ల నిధులు మంజూరు చేసింది.

విద్యార్థుల ఇబ్బందులు దూరం

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతోపాటు వారెదుర్కొంటున్న ఇబ్బందులు దూరం కానున్నాయి. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు 48 ప్రైవేట్, ఇతర కళాశాలలున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం 17 కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఇటీవల రూ.3.34 కోట్లు మంజూరు చేసింది.

సౌకర్యాలు కల్పిస్తాం



మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం 17 జూనియర్ కళాశాలలకు రూ.3.34కోట్లు విడుదల చేసింది. ఆ నిధులతో భవనాలు, మూత్ర శాలల మరమ్మతులు, డ్యూయల్ డెస్క్‌లు, గ్రీన్ బోర్డులు తదితర సౌకర్యాలు కల్పిస్తాం. ప్రవేశాల ప్రక్రియ ఈ నెలాఖరు వరకు కొనసాగుతుంది. ఇంకా విద్యార్థుల సంఖ్య పెరిగే ఆకాశం ఉంది.

-గోవింద్‌రావు, డీఐఈఓ-సంగారెడ్డి

ఏ కాలేజీకి ఎన్ని నిధులు

ప్రభుత్వ జూనియర్ కళాశాల	మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)
1) సంగారెడ్డి(బాలికలు)	రూ. 10.50
2) సంగారెడ్డి(బాలురు)	రూ. 31
3) పుల్‌కల్	రూ. 9.20
4) పటాన్‌చెరువు	రూ. 6
5) రామచంద్రపురం(గీతా భూపాల్‌రెడ్డి)	రూ. 12.50
6) అందోల్	రూ. 20
7) అందోల్(బాలికలు)	రూ. 15
8) సదాశివపేట్	రూ. 21.60
9) కొండాపూర్	రూ. 25
10) జిన్నారం	రూ. 21
11) నారాయణఖేడ్	రూ. 28
12) కోహీర్	రూ. 24.50
13) హత్నూర	రూ. 11.30
14) హద్నూర్(న్యాల్‌కల్ మండలం)	రూ. 29.50
15) న్యాల్‌కల్	రూ. 26.50
16) బుధేరా(మునిపల్లి)	రూ. 13.10
17) కంగ్టి	రూ. 28.50



మహిళా పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

విద్య, వైద్యం హబ్‌గా అభివృద్ధి చేస్తాం

- పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట (అందోల్): అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్, హెల్త్ కేర్ హబ్‌గా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. అందోల్‌లో ఉన్న కేజీబీవీ పాఠశాల, నర్సింగ్ కళాశాల, మహిళా పాలిటెక్నిక్ కళాశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు, డబుల్ రోడ్డు పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాలని అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన డిజిటల్ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్, విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. అందోల్ నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులను సమకూర్చుతున్నామన్నారు. నర్సింగ్ కళాశాల వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట రాజనర్సింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిష, అందోల్ ఆర్డీఓ పాండు, మున్సిపల్ కమిషనర్ రవీందర్, పాఠశాలల ప్రిన్సిపాల్స్ జ్యోతి, వాణి, పద్మ మాజీ కౌన్సిలర్ సురేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్, ధనుంజయ రెడ్డి తదితరులున్నారు.

గోపాల మిత్రల గోడు వినరేం!

- 10 నెలలుగా అందని వేతనాలు
- 25 ఏళ్లుగా భద్రత లేని బతుకులు



కృత్రిమ గర్భాధారణ నిర్వహిస్తున్న గోపాల మిత్ర

నారాయణఖేడ్: మూగ జీవాల సంరక్షణకు పాటుపడుతూ పొద్దస్తమానం కష్టిస్తున్న గోపాల మిత్రల కష్టాలకు ఫలితం దక్కడంలేదు. పదినెలలుగా విడుదలకాని చాలీచాలని వేతనం, ఏమాత్రం భద్రతలేని ఉద్యోగం, నిర్ణీత సమయంలేని ఉద్యోగంతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతీ అధికారి, ప్రజాప్రతినిధి వద్ద తమ గోడు వెళ్లబోసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువవడంతో మూగవేదన అనుభవిస్తున్నారు. మూగజీవాలకు సేవ చేస్తున్నామన్న సంతృప్తితోనే కష్టాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. 2000వ సంవత్సరంలో రాష్ట్రంలో గోపాల మిత్రలను ప్రభుత్వం నియమించింది. వీరు గ్రామీణ ప్రాంతాల్లోని పశువైద్యులు, పశు వైద్య సిబ్బందికి సహాయకారిగా పనిచేయాల్సి ఉంటుంది. కానీ వారు చేసే విధులన్నీ వీరే నిర్వర్తిస్తున్నారు.

ఉదయం లేచింది మొదలు..

ఒక్కో గోపాల మిత్రకు ఐదారు గ్రామాల పరిధి ఉంటుంది. ఉదయం లేచింది మొదలు సమయం అంటూ లేకుండా రాత్రి పొద్దుపోయేవరకు ఇళ్లకు తిరిగి పశువులకు అవసరమైన వైద్య సహాయాన్ని అందిస్తుంటారు. ప్రయాణ సమయాల్లో ఏదైనా జరగరానిది జరిగితే తమపై ఆధార పడ్డ కుటుంబం రోడ్డున పడాల్సిందేనని గోపాల మిత్రలు వాపోతున్నారు.

జిల్లా	గోపాల మిత్రలు
సంగారెడ్డి	45
సిద్దిపేట	66
మెదక్	48

ఇవీ నిర్వర్తిస్తున్న విధులు..

గోపాల మిత్రలు ఆరునెలలు శిక్షణ పొంది అనుభవం కలిగిన ప్రొఫెసర్ల పరీక్షల్లో ఉత్తీర్ణులై ఎంపికయ్యారు. బస్సు సౌకర్యం లేని గ్రామాలు, తండాలకు సైతం వెళ్లి విధులు నిర్వర్తిస్తారు. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు వైద్యుల సూచనలు, సలహాల మేరకు అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సలు అందిస్తారు. భారత్ పశుధన్‌లో నమోదు చేస్తుంటారు.

వైఎస్ చలవతో వేతనం ప్రారంభం..

2000లో నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండగా గోపాల మిత్రలను పశుసంవర్ధక శాఖలో నియమించారు. కానీ, వీరికి వేతనం చెల్లించలేదు. 2007లో నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వీరి సేవలను గుర్తించి రూ.1,200ల గౌరవ వేతనం చెల్లించడం ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వాలు వేతనాలను పెంచుతూ నేడు రూ.11,050లు అందిస్తున్నారు.

ఉదయం తెల్లవారగానే మూగజీవాల చెంతకు..



తాము ఉదయం తెలవారగానే, లేదా పాడి రైతులు ఫోన్ చేసి సమస్య చెప్పగానే వారి వద్దకు వెళ్తాం. పశువులకు ఎదురైన సమస్యకు తగు ప్రథమ చికిత్సలు అందజేస్తాం. ప్రయాణ సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నాం. కనీస ఉద్యోగ భద్రత లేదు.

- రాంచందర్‌రావుపాటిల్, గోపాలమిత్ర, గాజుల్‌పాడ్

25 ఏళ్లుగా విధులు..



25 ఏళ్లుగా పాడి రైతుల ముంగిట్లో మేలు జాతి పశువుల అభివృద్ధి కోసం శ్రమిస్తున్నాం. ప్రభుత్వం గుర్తించి రూ.24వేల వేతనం చెల్లించాలి. సీనియార్టీ ప్రకారం పశుసంవర్ధక శాఖలో ఆఫీస్ సబార్డినేటర్లుగా నియమించాలి.

- గంప శివకుమార్, జిల్లా అధ్యక్షుడు, గోపాల మిత్ర సంఘం

పుట్టిన రోజుకు ముందే పుట్టెడు దుఃఖం మిగిల్చి

కలకలం రేపిన కాంగ్రెస్ నేత హత్య

- కొల్చారం మండలం పైతరలో విషాదం



రోదిస్తున్న కుటుంబసభ్యులు



అనిల్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): కాంగ్రెస్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి అనిల్ హత్య ఉమ్మడి జిల్లాలో కలకలం రేపింది. పేద కుటుంబంలో పుట్టిన అనిల్.. రాజకీయంగా అంచెలంచెలుగా జిల్లాస్థాయి నాయకుడిగా ఎదిగారు. పైగా ఆర్థికంగా బలపడ్డారు. అయితే సోమవారం హైదరాబాద్‌లో పార్టీ సమావేశానికి వెళ్లి తిరిగి వస్తుండగా దుండగులు వెంటాడి కాల్పులు జరిపి అనిల్‌ను మట్టుబెట్టారు. దీంతో అతడి సొంతూరు కొల్చారం మండలం పైతరలో విషాదం నెలకొంది. బుధవారం అనిల్ పుట్టిన రోజు ఉండటం ఒక రోజు ముందే హత్యకు గురికావడంతో అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు.

అయ్యో.. దేవుడా..

'అయ్యో.. బిడ్డా పుట్టిన రోజుకు ఒక ముందే మమ్మల్ని విడిచి పోయావా?.. దేవుడా మేమేం పాపం చేశాం.. నా బిడ్డను తీసుకెళ్లావా?' అంటూ అనిల్ తల్లి యేసమ్మ రోదించడం అక్కడున్న వారిని కదిలించింది. బర్త్‌డే వేడుకలు చేసుకుందాం.. అందరం కలుసుకుందాం అని చెప్పిన అనిల్‌ను ఇలా విగతజీవిగా చూస్తామని కలలో కూడా ఊహించలేదని స్నేహితులు కన్నీటిపర్యంతమయ్యారు. మా అన్నకు శత్రువులు కూడా ఎవరూ లేరని అనిల్ సోదరుడు నవీన్ విలపిస్తున్నాడు. పోలీస్ ఈ విషయంలో పూర్తి దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

గ్రామంలో విషాదఛాయలు

అనిల్ మృతితో పైతర గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. కావాలనే పిలిచి తమ కుమారుడిని హత్య చేశారంటూ తల్లిదండ్రులు విలపిస్తున్నారు. అనిల్‌పై కాంగ్రెస్ నాయకులతోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఫోన్ మాట్లాడిన 15 నిమిషాలకే..

ఫోన్‌లో మాట్లాడిన 15 నిమిషాలకే యాక్సిడెంట్ అయ్యిందన్న వార్త అందిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు గాంధీభవన్‌లో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశానికి నాతో పాటు అనిల్, ఇంకా కొంతమంది నాయకులు పాల్గొన్నారన్నారు. తిరుగు ప్రయాణంలో అదే కారులో నేను మరికొంతమంది కలసి ప్రయాణమయ్యామన్నారు. నేను కూకట్‌పల్లి మెట్రోస్టేషన్ వద్ద దిగి వెళ్లిపోయానని తెలిపారు. రాత్రి 7:45కు ఫోన్ చేయగా అందర్నీ వారివారి గ్రామాల్లో దించేసి ఇంటికి వెళ్తున్నట్లు చెప్పారని, పావుగంట తర్వాత అనిల్‌కు యాక్సిడెంట్ అయిందని ఫోన్ వచ్చిందని వివరించారు.

కాళేశ్వరం నీటి సర్వేకు రూ.108.50 కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న సంగమేశ్వర్

- త్వరలో సింగూర్ పనులకు సీఎంతో శంకుస్థాపన
- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్

జోగిపేట (అందోల్): కాళేశ్వరం నుంచి సింగూరు ప్రాజెక్టులోకి 20 టీఎంసీల నీటిని తరలింపునకు కాళేశ్వరం నీటి సర్వే పనులకు ప్రభుత్వం రూ.108.50 కోట్ల నిధులను మంజూరు చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. కాళేశ్వరం నీటి సర్వే పనులు పూర్తయ్యేందుకు రూ.1000 కోట్లు అవుతుందని, దీనికోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.108.50 కోట్ల నిధులతో రూపొందించే సర్వే పనులు రెండు మూడు నెలల్లో పూర్తయితే, పెద్దరెడ్డిపేట వద్ద రూ.1000 కోట్ల నిధులతో చేపట్టబోయే సింగూరు కాల్వ పనులకు సీఎం రేవంత్ రెడ్డితో శంకుస్థాపన చేయిస్తామని తెలిపారు. ఈ సర్వే పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని అందోల్, వట్‌పల్లి, రేగోడు, అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల పరిధిలో ఉన్న రైతాంగానికి 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, అందోల్, టేక్మాల్ పార్టీ అధ్యక్షుడు శివరాజ్, నిమ్మ రమేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, మాజీ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు నిధులు

- ఉమ్మడి మెదక్ జిల్లాకు రూ.3.83 కోట్లు
- 16 మున్సిపాలిటీలకు కేటాయింపు
- మెరుగుపడనున్న పట్టణాలు



సిద్దిపేట మున్సిపాలిటీ

సాక్షి, సిద్దిపేట: పట్టణాలకు ప్రతీ ఏటా స్వచ్ఛ భారత్ మిషన్ ర్యాంకులను కేటాయిస్తుంది. వివిధ కేటగిరిలలో ప్రతిభ కనబర్చిన మున్సిపాలిటీలకు స్వచ్ఛ భారత్ అవార్డులను ప్రకటిస్తుంది. సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ పట్టణాలకు అత్యధికంగా అవార్డులు దక్కాయి. అక్టోబర్ 2021లో ప్రారంభమైన స్వచ్ఛ భారత్ మిషన్ 2026 అక్టోబర్ వరకు కొనసాగ నుంది. ఇందులో భాగంగా ప్రతీ సంవత్సరం పట్టణాలకు నిధులు కేటాయిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీలకు రూ.3,83,84,676 నిధులు మంజూరు చేశారు. ఆయా పట్టణాల్లో జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించింది. అత్యధికంగా సిద్దిపేట మున్సిపాలిటీకి, అత్యల్పంగా రామాయంపేట మున్సిపాలిటీకి నిధులు మంజూరయ్యాయి.

వీటి నిర్వహణకు..

మున్సిపాలిటీలకు కేటాయించిన నిధులను ఘన వ్యర్థాల నిర్వహణ, సామర్థ్యాలు, నైపుణ్యాల పెంపు, విజ్ఞానం, కమ్యూనికేషన్, ప్రజారోగ్య పరిరక్షణకు ఉపయోగపడేలా వెచ్చించనున్నారు. అలాగే పారిశుద్ధ్య కార్యక్రమాలు, బయో మైనింగ్ కార్యక్రమాల నిర్వహణకు వినియోగించాలని ఆదేశించారు.

సౌకర్యాలు ఇక మెరుగు

మున్సిపాలిటీలలో వసూలయ్యే పన్నుల ద్వారా దాదాపు అన్ని కార్యక్రమాల నిర్వహణ కొనసాగుతోంది. అయితే ఆదాయం తక్కువగా వస్తుండటంతో కార్యాలయ భవనాల, టాయిలెట్ల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ నిధులు మంజూరైన తరుణంలో మున్సిపాలిటీలలో సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది.

కేటాయింపు ఇలా..

మున్సిపాలిటీ	నిధులు (రూ.లలో)
అమీన్‌పూర్	7,17,141
అందోల్-జోగిపేట	4,26,848
బొల్లారం	42,76,373
చేర్యాల	3,65,174
దుబ్బాక	5,49,240
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	66,26,784
హుస్నాబాద్	4,33,385
మెదక్	8,12,730
నర్సాపూర్	3,79,634
రామాయంపేట	3,59,549
సదాశివపేట	6,96,026
సంగారెడ్డి	22,29,523
సిద్దిపేట	1,19,70,573
తెల్లాపూర్	45,56,296
తూప్రాన్	24,13,867
జహీరాబాద్	12,05,599
నారాయణఖేడ్	3,65,934

పట్టివేతలు

రేషన్ బియ్యం



ఖేడ్ పట్టణంలోని ఓ బియ్యం దుకాణంపై పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అండ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. రవాణాకు సహకరించిన అయిదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్థానిక పౌరసరఫరాల శాఖ గోదాంకు తరలించారు. - నారాయణఖేడ్

గంజాయి



కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన ఖురేషి షబ్బీర్ అలీ ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకుని విక్రయించేందుకు మంగళవారం సాయంత్రం రామచంద్రాపురంకు రాగా విశ్వసనీయ సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 8 కిలోల గంజాయి, ఒక మొబైల్ ఫోనును స్వాధీనం చేసుకున్నారు.

- రామచంద్రాపురం(పటాన్‌చెరు)

క్లుప్తంగా

మద్రాస్ ఐఐటీతో అనంతసాగర్ ఒప్పందం

చిన్నకోడూరు(సిద్దిపేట): స్కూల్ కనెక్ట్ పేరుతో ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి మండలంలోని అనంతసాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల భాగస్వామ్యం కానుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ లాంటి కోర్సులు, కోడింగ్ సంబంధించిన విషయాలను ఐఐటీ ప్రొఫెసర్లతో ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు నేర్చుకోనున్నారు. పూర్తి విధి,విధానాలను త్వరలో పాఠశాలకు తెలియజేస్తారని పాఠశాల హెచ్ఎం జ్యోతి తెలిపారు.

రైస్‌మిల్ యజమాని అరెస్ట్

చిన్నశంకరంపేట(మెదక్): రైస్‌మిల్ యజమాని, మాజీ సర్పంచ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మండల కేంద్రంలో రైస్‌మిల్ నిర్వహించే మైనంపల్లి రంగారావు గత ఏడాది ప్రభుత్వ ధాన్యం తీసుకుని తిరిగి బియ్యం అందించడంలో విఫలమయ్యాడు. ప్రభుత్వానికి రూ.1 కోటి 35 లక్షలు బకాయిపడగా, అందులో రూ.కోటి నగదు రూపంలో చెల్లించాడు. మరో రూ.35 లక్షలకు తోడు 25 శాతం పెనాల్టీ చెల్లించాలని అధికారులు నోటీసులిచ్చారు. కాగా పెనాల్టీ తగ్గించాలని రంగారావు అభ్యర్థించాడు. కాగా ఈ కేసులో చిన్నశంకరంపేట పోలీసులు కుటుంబ సభ్యులతో తిరుపతి వెళ్లిన రంగారావును అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

బైక్‌ను తగులబెట్టిన దుండగులు

నర్సాపూర్ : గుర్తు తెలియని దుండగులు బైక్‌కు నిప్పు పెట్టారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం వివరాల ప్రకారం... నర్సాపూర్‌కు చెందిన రమేష్ నాయక్ సోమవారం రాత్రి ఇంటి ముందు బైక్‌ను పార్కు చేశాడు. అర్ధరాత్రి శబ్దం వినిపించడంతో బయటకు వచ్చి చూసేసరికి బైక్ కాలిపోతుండటంతో కుటుంబ సభ్యులతో కలిసి మంటలు ఆర్పాడు. బైక్ తగులబడుతున్న సమయంలో ఓ వ్యక్తి కన్పించాడని, అతడికి, తనకు గతంలో డబ్బుల విషయమై గొడవలు జరిగాయని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జైలు, జరిమానా

సిద్దిపేటకమాన్: మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం ... పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 18మంది మద్యం తాగి పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.28,500 జరిమానా, వీరిలో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సితారాం

శివ్వంపేట(నర్సాపూర్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని తుక్యా తండాకు చెందిన సితారాం(50) బోరు మోటార్లు రిపేర్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారం రోజుల క్రితం తిమ్మాపూర్ నుంచి తండాకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ..

సంగారెడ్డి క్రైమ్: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం... గుర్తు తెలియని మహిళ(35 నుంచి 45), గత నెల 24న ఆస్పత్రి అత్యవసర ద్వారం వద్ద మహిళ అపస్మారక స్థితిలో పడి ఉంది. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది చికిత్స నిమిత్తం వెంటనే ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఆమె చికిత్స పొందుతూ గత నెల 28న మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మంగళవారం సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ మార్చురీలో భద్రపరిచారు.

ఫలహారం బండి ఊరేగింపు


ఫలహారం బండి ఎదుట పోతరాజుల విన్యాసాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆషాఢమాస బోనాల ఉత్సవాలు సిద్దిపేట జిల్లాలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రతి రోజు అమ్మవార్లకు భక్తులు బోనాలు తీసుకెళ్లి నైవేద్యాలు సమర్పించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నల్లపోచమ్మ ఆలయానికి భక్తులు ఫలహారాల బండిని తరలించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, జోగినిల నృత్యాలు, డోలు చప్పుళ్ల మధ్య ఫలహారం బండి అమ్మవారి ఆలయానికి చేరుకుంది. సిద్దిపేటలో ఫలహారాల బండి అమ్మవారి వద్దకు ఊరేగింపుగా వెళ్లడం ఇదే తొలిసారి అవ్వడంతో భక్తులు భారీగా తరలివచ్చారు.

అధిక ఎరువులతో అనర్థాలే..!

రసాయన ఎరువులతో నష్టం

పంట సాగులో రైతులు రసాయన ఎరువులను అధికంగా వాడుతున్నారు. దీంతో పుడమికి నష్టం, మానవ మనుగడకు కష్టాలు ఎదురవుతున్నాయి. దీంతో భూమి సహజ లక్షణాలను కోల్పోయి నిస్సారమవుతోంది. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో భూములు సేద్యానికి పనికి రాకుండా పోతాయని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే సేంద్రియ ఎరువుల వాడకం ఒక్కటే మార్గమని సూచిస్తున్నారు.

దుబ్బాకటౌన్:


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నరేష్

- మానవ మనుగడకు కష్టాలు
- సహజ లక్షణాలు కోల్పోతున్న నేలలు
- సేంద్రియ ఎరువులే మేలంటున్న అధికారులు
- జిల్లాలో 5.20 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 5.20 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 2.17లక్షల ఎకరాల్లో వరి, 93 వేల ఎకరాల్లో పత్తి, 19 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 31 వేల ఎకరాల్లో కంది, 131 ఎకరాల్లో పెసర పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల అంచనా. పంట దిగుబడి ఎక్కువగా రావాలని రైతులు ఎకరాకు 150 కిలోల డీఏపీ, వంద కిలోల యూరియాను వినియోగిస్తున్నారు. పూత దశకు వచ్చాక పత్తికి 5 సార్లు పురుగుల మందులను పిచికారీ చేసున్నారు. 1960 సంవత్సరంలో వచ్చిన హరిత విప్లవం వ్యవసాయ విధానంతో పూర్తిగా రూపురేఖలు మారిపోయాయి. రసాయనిక ఎరువులతో దిగుబడులు పెరుగుతాయని ఎరువుల మోతాదులు కూడా పెంచుతున్నారు.

యూరియా కోసం బారులు..

అధిక యూరియా వినియోగించవద్దని రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో రైతులకు అవగాహన కల్పించినా తీరు మారడం లేదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. సరిపడా యూరియా పంపిణీ చేసినా కూడా అధిక శాతం కొనుగోలు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

క్షీణిస్తున్న భూసారం..

రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వాడటం ద్వారా పంట భూములు నిస్సారమవుతున్నాయి. యూరియా బస్తాల్లో 46 శాతమే యూరియా ఉంటుంది. మిగతా 54 శాతం సున్నపు గుళికలాంటి మూలపదార్థాలు ఉంటాయి. ఈ గుళికలపై సున్నపు పూత పూస్తారు. దీనిని నేలపై వేయడంతో 54 శాతం ఉన్న మూల పదార్థాలు ఏటా నేలపై పేరుకుపోయి భూసారం తగ్గుతుంది. నేలపై ఉండే సహజ బ్యాక్టీరియా, రైతు నేస్తాలు నశించిపోతున్నాయి. ఫలితంగా రైతులకు దిగుబడులు తగ్గుతున్నాయి.

కాలానికనుగుణంగా మారుతూ..

గతంలో వ్యవసాయం చేసే తీరే వేరుగా ఉండేది. రైతులు తమ కుటుంబానికి సరిపడా అన్ని రకాల పంటలు పండించేవారు. దిగుబడుల కోసం సేంద్రియ ఎరువులనే చల్లేవారు. అందువల్లే అప్పట్లో రైతులు ఆరోగ్యంగా ఉండేవారు. పశువుల మల, మూత్ర వ్యర్థాలతో తయారు చేసిన ఎరువులను ఎక్కువగా వినియోగించేవారు. కానీ మారుతున్న కాలానికనుగుణంగా వ్యవసాయ విధానం కూడా మారుతూ వస్తుంది.

సేంద్రియ ఎరువులు ఉత్తమం



భూముల సారం కోల్పోకుండా ఉండేందుకు రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి. ఈ ఎరువులతో భూమిలో పోషక విలువలు పెరిగి గుల్లగా మారుతుంది. నీటిని పీల్చుకునే తత్వం వృద్ధి చెందుతుంది. మొక్కలకు నీటితో పాటు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయి. రైతులు నానో యూరియాను వాడండి. సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్నాం.

– మల్లయ్య, ఏడీఏ, దుబ్బాక

భూ భారతితో రైతుకు న్యాయం

ఎట్టకేలకు రైతు పేరిట పాస్‌బుక్‌లు


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న మడప్ప, రైతు నాయకులు

మునిపల్లి(అందోల్): కంకోల్ గ్రామానికి చెందిన రైతు మడప్పకు భూ భారతితో న్యాయం జరిగింది. వివరాలు ఇలా... గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌లో తప్పిదం వల్ల మడప్ప 5 ఎకరాల భూమి వేరే రైతుపై నమోదైంది. దీంతో తన భూమి వేరే రైతుపై తప్పుగా పడిందని, భూమి రికార్డులు చూసి తన పేరుపైకి మార్చాలని తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయం చుట్టూ ఆరేళ్లుగా తిరిగాడు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో హైదరాబాద్‌లోని సీసీఎల్ కార్యాలయం చుట్టూ తిరిగి పాత రికార్డుల ప్రకారం తన 5 ఎకరాలకు సంబంధించి అధికారుల ద్వారా తన పేరిట పాస్ బుక్‌లు తీసుకున్నాడు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతు సమైక్య జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గంగాభవానిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగన్న, మల్లికార్జున్ శెట్టి, రెవెన్యూ అధికారి జైపాల్, శేఖర్, రాజు, ఈశ్వర్‌రెడ్డి, వీరన్న, రాంరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అలోవెరా సాగుతో అధిక ఆదాయం

కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి


శిక్షణ కార్యక్రమంలో మహిళా రైతులతో శాస్త్రవేత్త భార్గవి

కౌడిపల్లి(నర్సాపూర్): అలోవెరా పంట సాగు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి తెలిపారు. మంగళవారం మండలంలోని తునికి వద్దగల కేవీకేలో ఏఏఏఆర్ఎం ఆధ్వర్యంలో ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ మహిళా రైతులకు సేంద్రియ పద్ధతిలో అలవెరా, చిరుధాన్యాల సాగు, వాటి ఉత్పత్తులపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తక్కువ నీరు, తక్కువ ఖర్చుతో పడావు భూముల్లో అలవెరా సాగు చేయవచ్చన్నారు. సబ్బుల తయారీ, జ్యూస్, ఇతర సౌందర్య సాధనాలతోపాటు ఇతర ఉత్పత్తులలో ఉపయోగిస్తారని చెప్పారు. అనంతరం క్షేత్రస్థాయిలో అలవెరా పంట సాగును పరిశీలించి శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం


కూతురు మయూరితో రేణుక

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన తల్లీకూతురు అదృశ్యమయ్యారు. ఈ ఘటన ఇటీవల చోటుచేసుకుంది. ఎస్ఐ.ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం... పేటకు చెందిన చీలాపల్లి రేణుక, సాయిలు దంపతులు. వీరికి ఐదేళ్ల కూతురు మయూరి ఉంది. వీరు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల వీరు పీర్ల పండుగ సందర్భంగా మండలానికి వచ్చి తిరిగి ఈ నెల 9న హైదరాబాద్‌కు వెళ్లారు. అనంతరం సాయిలు భార్య, కూతురు కనిపించడం లేదని రేణుక తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దిపేట పట్టణంలో..

సిద్దిపేటకమాన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు వివరాల ప్రకారం.. పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన ఆకునూర్ బాల్‌నర్సయ్య (66) స్థానికంగా ఉన్న ఓ టింబర్‌డిపోలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతడు సోమవారం పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నాడు. ఉదయం భార్య రాజవ్వకు చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎరుపెక్కిన ఆకాశం



సూర్యాస్తమయంలో నీలాకాశం ఒక్కసారిగా ఎరుపెక్కింది. మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసేలా మబ్బులు ఏర్పడ్డాయి. సాయంత్రం ఆకాశం ఎర్రటి మబ్బులతో దర్శనమిచ్చింది. ఈ సుందర దృశ్యాన్ని సాక్షి క్లిక్ మనిపించింది.

ఝరాసంగం(జహీరాబాద్):

ఏసీబీ దాడులతో నిలిచిన చెక్కుల పంపిణీ

- నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, ఇద్దరు సిబ్బంది సస్పెన్షన్‌తో నిలిచిన కార్యకలాపాలు
- ఆర్డీఓకు అదనపు బాధ్యతలు

జహీరాబాద్: జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్) ఏర్పాటుకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు పరిహారం రూపంలో అందిస్తున్న చెక్కుల పంపిణీ నిలిచిపోయింది. ఈనెల 10న జహీరాబాద్‌లోని 'నిమ్జ్'కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సతీశ్ రూ.15వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. డిప్యూటీ కలెక్టర్ రాజుకు ఇవ్వాలనుకున్న రూ.50వేలను స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ సతీశ్‌లతోపాటు డ్రైవర్ దుర్గయ్యను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఎలాంటి కార్యకలాపాలు కొనసాగకపోవడంతో రైతు లెవరూ నిమ్జ్ కార్యాలయానికి వెళ్లడం లేదు. దీంతో కార్యాలయం వెలవెలబోతోంది. అయితే చెక్కులు పంపిణీ చేసే బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడమే ఇందుకు కారణం.

ఆర్డీఓకు అదనపు బాధ్యతలు

జహీరాబాద్ ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న రాంరెడ్డికి నిమ్జ్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. డిప్యూటీ కలెక్టర్ వచ్చేవరకు ఈ వ్యవహారాన్ని ఆర్డీఓనే పర్యవేక్షించనున్నారు. ప్రస్తుతం భూ సేకరణ, చెక్కుల పంపిణీకి బ్రేక్ పడినందున వేగం పెంచే దిశలో ఉన్నతాధికారులు ఏ మేరకు చర్యలు చేపడతారనే దానిపై రైతులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.

బంతిరాళ్ల సమాధులను పరిరక్షించాలి

చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్


అయినాపూర్ గ్రామ శివారులో బంతిరాళ్ల సమాధులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ శివారులో క్రీస్తు పూర్వం 2వేల సంవత్సరాల నాటి బంతిరాళ్ల సమాధులు ఉన్నాయని, అవి మాయమవుతున్నాయని చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ పేర్కొన్నారు. బంతిరాళ్ల సమాధులను పరిశీలించి వివరాలు వెల్లడించారు. ప్రాచీన శిలాయుగంలో మనిషి కళేబరాన్ని ప్రకృతికి వదిలివేయగా, కొత్త రాతి యుగంలో చనిపోయిన వ్యక్తితో పాటు అతనికి ఇష్టమైన వస్తువులు, వాడిన వస్తువులు అతనితో పాటు ఖననం చేసేవారని చెప్పారు. ఈ సమాధుల చుట్టూ పెద్ద బండరాళ్లను పేర్చి మధ్యలో చనిపోయిన వ్యక్తిని ఖననం చేసేవారని తెలిపారు. ఆ రాళ్లను రాక్షసులు పెట్టేవారు అనుకుని రాకాసి గుళ్లు అని , బంతిరాళ్ల సమాధులు పిలుస్తుంటారని వివరించారు. అయినాపూర్ గ్రామ శివారులో 60 వరకు ఉండేవని రైతులు వాటిని తీసివేసి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నాలుగు మాత్రమే ఉన్నాయని వాటిని కాపాడాలని కోరారు.

అటవీ భూమి ఆక్రమణ


పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్‌తో అటవీ సిబ్బంది

ట్రాక్టర్ స్వాధీనం.. కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): అక్రమంగా అటవీ భూమిని ఆక్రమించి దున్నిన ఘటన మండల పరిధిలోని మగ్దుంపూర్ అటవీ ప్రాంతం కంపార్ట్‌మెంట్ 348లో చోటుచేసుకుంది. శివ్వంపేట సెక్షన్ అధికారి శ్రీధర్‌కుమార్ వివరాల ప్రకారం... జెంగ్యా తండాకు చెందిన కోలా రాజు అటవీ భూమి చుట్టూ తవ్విన కందకాన్ని పూడ్చివేసి భూమిని చదును చేశాడు. అంతేగాక రాత్రి వేళల్లో ట్రాక్టర్‌తో దున్నకం చేపట్టాడు. ట్రాక్టర్ ఇంజిన్‌కు కేజీవీల్ ఏర్పాటు చేసినప్పటికి స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేశారు. బీట్ ఆఫీసర్లు కుమార్, శ్రీవల్లి, కరీంముల్లా, రాజమణి, గోపాల్, రమ్యశ్రీ, శిరీష, రెంజ్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

కోళ్ల వ్యాన్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

టేక్మాల్(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కాద్లూర్ గ్రామశివారులో షాకీర్‌నగర్ దర్గావద్ద చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం... అల్లాదుర్గం మండలం ముప్పారం తండాకు చెందిన సెనావత్ వాల్యానాయక్ (47) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం వేళలో టేక్మాల్ నుంచి బొడ్మట్‌పల్లి వైపు వాల్య టీవీఎస్ ఎక్సల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కోళ్ల వాహనం ఢీకొట్టింది. ప్రమాదంతో కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఏఎస్ఐ కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య బుజ్జితో పాటు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు దాటుతుండగా..

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం వివరాల ప్రకారం... ఈనెల 11న పట్టణంలో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనం అనిల్ కుమార్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. అతడి వివరాలు తెలుసుకోగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఒంగోలు అని తెలిసింది. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగి మృతి

చేగుంట(తూప్రాన్): విద్యుదాఘాతంతో ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మర్పల్లి శ్రీనివాస్(38) తూప్రాన్ ఆర్డీఓ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం గ్రామంలోని తన పొలంలో వరి నాట్లు వేయాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో బోరు మోటార్ పనిచేయకపోవడంతో దానికి మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్‌లు శ్రీకాంత్, కరీంలతో పాటు పలువురు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

చేపల వేటకు వెళ్లి..

పాపన్నపేట(మెదక్): ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గాజుల గూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య కథనం మేరకు... గ్రామానికి చెందిన చాకలి శివ్వయ్య (45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులోని మంజీరా నదిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. కొడుకు కల్యాణ్‌తో కలిసి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడిపోయాడు. అక్కడ ఉన్నవారు గమనించి వెంటనే నదిలోకి దూకి బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న అతన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్ఆర్‌తో రైతులకు మేలు

నారు, నాట్లు లేకుండానే నేరుగా వరి సాగు

- నీటి వినియోగం, కూలీల ఖర్చు ఆదా
- జిల్లాలో వంద ఎకరాల్లో పంట
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, నీటి వినియోగాన్ని అధికం చేసుకుంటూ, సంప్రదాయ వరి సాగు చేస్తున్న రైతులకు డీఎస్ఆర్ (వరి విత్తనాలను నేరుగా పొలంలో నాటడం) విధానంపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో ఇప్పటివరకు సుమారు 100 ఎకరాల్లో ఈ విధానంలో సాగు చేస్తున్నట్లు అంచనా వేస్తున్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్):


డీఎస్ఆర్ సాగును పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్, తదితరులు

మండలంలో ఆరు ఎకరాల్లో డీఎస్ఆర్ (డైరెక్ట్ సీడెడ్ రైస్) విధానం కొనసాగుతుంది. నేరుగా వరి విత్తనాలు తడి, పొడి నేలల్లో విత్తుకునే అవకాశం ఉండగా, జిల్లా రైతులు పొడి నేలల్లోనే ఎక్కువగా, డ్రమ్‌సీడర్ సహాయంతో విత్తుకుంటున్నారు. కాగా తడి నేలల్లో విత్తనాలు వేసే రైతులు ముందుగా నీళ్లల్లో నానబెట్టి, బురదలో చల్లుకోవచ్చు. గతంలో పంట కోసిన అనంతరం నేలను రెండుసార్లు దుక్కి దున్ని, రోటావేటర్ చదును చేసిన తర్వాత, ట్రాక్టర్‌తో నేలలో 2 నుంచి 3 సెం.మీ. లోతు సాళ్లు తీసుకుని, నేరుగా, లేదా డ్రమ్ సీడర్‌తోనైనా వరి విత్తనాలు వేసుకోవచ్చు. వరుసల మధ్య సుమారు 20 సెం.మీ. దూరం ఉండేలా చూసుకోవాలి. ఎకరాకు సుమారు 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరమవుతాయని, విత్తన ఎంపికలో వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. కలుపును మాత్రం సమయానికి తీయాలని, లేదంటే దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే డీఎస్ఆర్‌తో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

ప్రయోజనాలు

ఈ పద్ధతితో తూకం వేయడం, నారు మడులను సంరక్షించడం ఉండకపోవడంతో నీటి వినియోగం తగ్గుతుంది. నాటు వేయరు గనుక కూలీల ఖర్చు ఉండదు. నేలను అధిక భారంతో దున్నకపోవడంతో నిర్మాణం సక్రమంగా ఉంటుంది. రసాయనాల వినియోగం చాలావరకు తక్కువగా ఉండటంతో నేల సారవంతమవుతుంది. ఈ పద్ధతి వాతావరణ మార్పులకు అనుకూలంగా ఉండటంతో గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గిస్తుంది. సాధారణ వరి సాగుతో పోలిస్తే పెట్టుబడి తక్కువ. పైగా సంప్రదాయ వరి సాగు కంటే పది రోజుల ముందే పంట చేతికొస్తుంది.

తగ్గిన శ్రమ.. ఖర్చులు



అధికారుల సూచనల మేరకు మూడెకరాల్లో డీఎస్ఆర్ విధానంలో వరి సాగు చేశా. ప్రస్తుతం పంట బాగుంది. నీటి వినియోగం తగ్గడంతో పాటు, కూలీల అవసరం తగ్గింది. దీంతో చాలావరకు శ్రమ తగ్గింది. నారు, నాట్లు లేకపోవడంతో ఖర్చులు చాలా తగ్గాయి. గతంలో నాటేసే కూలీలకే ఎకరాకు 5 నుంచి 6 వేలకు ఇచ్చేవాళ్లం. సరైన దిగుబడి వస్తే ఈ పద్ధతినే కొనసాగిస్తా.

– దేవేందర్‌రెడ్డి, రైతు, చండూర్

అవగాహన కల్పించాం



జిల్లా రైతులకు తమ సిబ్బంది డీఎస్ఆర్ పద్ధతిపై అవగాహన కల్పించారు. దీంతో ఆసక్తి ఉన్న పలువురు రైతులు ముందుకు వచ్చారు. ఈ విధానంలో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. తక్కువ సాగు నీరు ఉన్న రైతులకు ఎంతో ఉపయోగం. పైగా పెట్టుబడి తక్కువ. పంటకాల వ్యవధి తక్కువ. మరింత మంది రైతులు ఈ విధానంలో సాగు చేయాలి.

– కే.దేవ్‌కుమార్, డీఏఓ